నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 21 జనవరి 2025 | SANGAREDDY

అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 20: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుదారులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రామానికి 300 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం కేవలం 20 రేషన్‌కార్డులు ఇచ్చి చేతులు దులుపుకొంటమంటే ఊరుకోబోమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 12లక్షల మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే, ప్రభుత్వం కేవలం లక్షలోపు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొందన్నారు. గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలు ఉన్నాయనే భయంతోనే రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నారని, దరఖాస్తు చేసుకున్న 12లక్షల మందికి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, మీరిచ్చిన హామీ ప్రకారం వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పంట రుణమాఫీకాని వారిని అధికారుల ద్వారా గుర్తించి వందశాతం రుణమాఫీ చేయాలన్నారు. ఇవన్నీ చేయని పక్షంలో ప్రజలే తిరగబడి గ్రామాల్లోకి రానివ్వరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలతో ప్రజలను మోసం చేయడం, వంచించడమే అన్నారు. గతంలో అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలు, 13 హామీలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్లు పెట్టుకొని లబ్ధిపొందారని, ప్రస్తుతం అదేవిధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇలాంటి చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెసోళ్లకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, ఓట్లు అడగాలంటే ఇచ్చిన హామీలు అమలు చేసి గ్రామాల్లోకి రావాలన్నారు. బీసీకు రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఏడాది కాలంలోనే ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని, మళ్లీ జనవరి 26తో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పాండు గౌడ్, నాయకులు ఉమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాజీపూర్‌లో 17వ శతాబ్దం శిల్పాలు

శిల్పాన్ని పరిశీలిస్తున్న కొలిపాక శ్రీనివాస్

రాయపోల్, జనవరి 20: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని అనాజీపూర్‌లో 17వ శతాబ్దం నాటి వీర గల్లు శిల్పాలు ఉన్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృంద అహుత్సాహిక పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన బెస్త ఎల్లయ్య వ్యవసాయ భూమిలో ఉన్న శిల్పం వీరగల్లు అని పేర్కొన్నారు. ఈ శిల్పంలో వీరుడు ఎడమ చేతితో బాణం, కుడి చేతితో విల్లు పట్టుకొని యుద్ధ సన్నద్ధుడై ఉన్నాడని, మెడలో హారాలు, దండారెట్టలకు కడియాలు ఉన్నాయన్నారు. ఈ శిల్పంలో వీరుడు బాణం పట్టుకొని ఉండడం వల్ల కొంతమంది రాముడిగా, మరి కొంత మంది హనుమంతుడిగా కనిపిస్తున్నడని చెప్పారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం దగ్గర కూడా ఇంచుమించు ఇదే పోలికలతో మరో వీర గల్లు శిల్పం ఉంది. ఆ శిల్పంలో వీరుడికి పొడవాటి వెంట్రుకలు ముడి కట్టి ఉండడం వల్ల ఆ శిల్పాన్ని స్త్రీ శిల్పంగా పిలుస్తున్నారని చెప్పారు. గ్రామం బయట పేట మీద అని పిలిచే చోట హనుమాన్ ఆలయం దగ్గర నంది, వినాయకుడు, నాగశిలా చాళుక్యుల కాలానికి చెందినవని కొలిపాక శ్రీనివాస్ పేర్కొన్నారు.

గ్రామసభల నిర్వహణపై గుబులు

- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో వడపోత
- లబ్ధిదారుల ఎంపిక తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసాపై అధికారులను నిలదీసే అవకాశం

నేటి నుంచి నాలుగు రోజులపాటు గ్రామసభలు

సంగారెడ్డి జనవరి 20(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో గ్రామసభల నిర్వహణపై అధికారుల్లో గుబులు నెలకొంది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తున్నది. గ్రామాల్లోని ప్రజలు గ్రామసభలను అడ్డుకుంటారని, అధికారులను నిలదీస్తారన్న ఆందోళన అధికార యంత్రాంగంలో నెలకొన్నది. జిల్లాలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామసభల నిర్వహణ జిల్లా యం త్రాంగానికి సవాలుగా మారింది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో కోతలకు, వడపోతలకు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యత ఇవ్వటమే ఇందుకు కారణం. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించింది. లబ్ధిదారుల ఎంపికకు కొత్తగా పలు నిబంధనలు విధించింది. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జిల్లాలో అర్హులైన వారందరికీ పథకాలు వర్తించే అవకాశాలు కనిపించటం లేదు. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తుంది. అయితే మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలను అధికారులు వెల్లడించనున్నారు. ప్రభుత్వ పథకాలకు ఎంపిక కానీ లబ్ధిదారులు గ్రామసభల్లో అధికారులను నిలదీయటంతో పాటు గ్రామసభలను అడ్డుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజులపాటు సాగే గ్రామసభల నిర్వహణ అధికారులకు కత్తిమీద సాములా మారింది. ఎలాగైనా గ్రామసభలు విజయవంతం చేయాలని, ఇందుకు అవసరమైతే పోలీసుల భద్రత తీసుకోవాలని జిల్లా యంత్రాంగం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది.

లబ్ధిదారుల ఎంపికపై సర్వత్రా అసంతృప్తి

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తున్నది. ఎన్నికలకు ముందు అందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొంతమందికి మాత్రమే పథకాలను వర్తింపజేయటంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. సంగారెడ్డి జిల్లాలో ప్రజలు ఎంతోకాలంగా కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తరేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో 74,995 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలనలో 26,158 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణనలో పెద్ద సంఖ్యలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం కులగణన ఆధారంగా అర్హులైన వారికి రేషన్‌కార్డుల జారీ చేసే అవకాశం ఉండటంతో 70శాతం మందికి రేషన్ కార్డులు రాకపోవచ్చు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డుల విషయమై గ్రామసభలో గొడవలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేసీఆర్ సర్కార్ హయాంలో జిల్లాలోని రైతులందరికీ రైతుబంధు పథకం కింద ప్రతిఏటా రూ.12వేలు పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ అయ్యేది. రైతుబంధు పథకం ప్రారంభమైన నాటి నుంచి 2023 వరకు 3.24 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,272 కోట్ల పెట్టుబడి సాయం డబ్బులు ప్రభుత్వం జమ చేసింది. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పది ఎకరాల్లోపు భూమి ఉన్నవారికి, సాగులో ఉన్న భూమికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని నిబంధనలను విధిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. జిల్లాలో సాగుకు యోగ్యంకాని భూముల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. ఇప్పటి వరకు 5వేల ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూమి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వం రైతుభరోసా కొంతమందికి అమలు చేస్తుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. గ్రామసభల్లో ఈ విషయమై రైతులు అధికారులను నిలదీసే అవకాశం ఉంది. ఎన్నికల్లో వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఇందిరమ్మ ఆత్మీయ పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇంటికి ఒక్కరికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతలుగా రూ.12వేలు ఇస్తామని చెబుతుంది. జిల్లాలో 20 పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలు 94వేల మంది ఉండగా వీరిలో వ్యవసాయ భూమిలేని కూలీలు 25వేల మంది ఉన్నారు. జిల్లాలో కేవలం 28శాతం మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయభరోసా వర్తించనుంది. దీంతో మిగితా కూలీలు గ్రామసభల్లో అధికారులను ఇందిరమ్మ భరోసా లబ్ధిదారుల ఎంపికపై ప్రశ్నించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో నిరుపేదలైన వారంతా ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం పరిమితంగా అమలు చేయనుండటంతో పేదలు ఈ విషయమై గ్రామసభల్లో అధికారులను నిలదీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే అధికారులు మాత్రమే ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతర ప్రక్రియగా చెబుతున్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న గ్రామసభల్లో లబ్ధిదారుల వివరాలు వెల్లడిస్తామని, వాటిపై అభ్యంతరాలు ఉంటే ప్రజలు చెప్పవచ్చని, కొత్త పథకాల కోసం దరఖాస్తులు అధికారులకు సమర్పించవచ్చని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఆందోళన

గజ్వేల్: లబ్ధిదారులకు సర్దిచెబుతున్న సీఐ సైదా, ఆర్ఐ కృష్ణ

గజ్వేల్, జనవరి 20: బీఆర్ఎస్ హయాంలో కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు అధికారులు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు అధికారులను కలిసినప్పటికీ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల బాధితులున్నారంటూ సమాధానం చెబుతూ వస్తున్నారన్నారు. లక్కీ డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసిన రెవెన్యూ అధికారులు నేటికీ ఇండ్లు చూపించకపోవడానికి కారణాలు చెప్పాలన్నారు. విషయం తెలుసుకున్న సీఐ సైదా, ఆర్ఐ కృష్ణ లబ్ధిదారుల వద్దకు చేరుకొని ప్రస్తుతం డబుల్ బెడ్రూంలో ఉంటున్న వారి వివరాలతోపాటు లక్కీ డ్రాలో పేరు వచ్చిన లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామసభలు ముగిసిన అనంతరం మల్లన్నసాగర్ ముంపు గ్రామాల బాధితుల్లో ఎవరికి ప్యాకేజీలు అందాయో తెలుసుకొని, వారిని వెంటనే డబుల్ బెడ్రూం ఇండ్ల నుంచి ఖాళీ చేయించి త్వరలోనే ఇండ్లు కేటాయిస్తామని చెప్పారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు.

నిర్వాసితులకు భరోసా కల్పించాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీబీఎఫ్ నాయకులు, మల్లన్నసాగర్ భూనిర్వాసితులు

సిద్దిపేట, జనవరి 20: మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. సోమవారం మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉపాధి హామీ పథకం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో నిర్వాసితులు సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు నాలుగేండ్లుగా ఉపాధి హామీ పనులు కల్పించకపోవడం వల్ల ప్రభుత్వం కూలీలకు అమలుచేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులు కాకుండా పోయారన్నారు. ఇటీవల మున్సిపాలిటీల్లో కలిపిన గ్రామాలకు ప్రత్యేక పరిస్థితులు అమలు చేస్తున్నట్లయితే మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ తదితర ప్రాజెక్టుల భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వమే భూమిని స్వాధీనం చేసుకున్నందున నిర్వాసితులు భూమి లేని కూలీలుగా మారారన్నారు. భూ సేకరణ 2013 చట్టం ప్రకారం ఆర్ అండ్ఆర్ ప్యాకేజీని వేములఘాట్ పరిధిలోని తుర్కబంజేరుపల్లికి చెందిన 44 మంది వడ్డెర కులస్తులకు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి మూడేండ్లు దాటినప్పటికీ నేటికీ పొజిషన్ చూపించలేదన్నారు. 1600 మంది మల్లన్నసాగర్ నిర్వాసితులకు ప్లాట్లు చూపించలేదన్నారు. దాదాపు 600 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయలేదన్నారు. దాదాపు 800 మంది ఒంటరి మహిళలకు ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, 400 ఎకరాలకు నష్టపరిహారం నేటికీ అందించలేదన్నారు. ధర్నాలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, హైకోర్టు న్యాయవాది దివాకర్, నిర్వాసితులు నర్సింహులు, కనకయ్య, రుక్కయ్య, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న మల్లన్నసాగర్ భూనిర్వాసితులు

హరీశ్‌రావును కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం జనవరి 19: మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దంపతులు హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పటాన్‌చెరువు నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ స్థితిగతులు, అభివృద్ధిపై మాజీమంత్రి హరీశ్‌రావు ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టపర్చాలని వారికి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

దైవదర్శనాల్లో చివరిసారిగా పాల్గొన్న సందీప్‌షా కుటుంబం (ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 20: దైవదర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందగా, పిల్లలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉత్తరభారతీయుల సంఘం అధ్యక్షుడిగా సేవలందిస్తున్న సందీప్‌షా నాలుగు రోజుల క్రితం అతని భార్య అంజలీదేవి, ముగ్గురు పిల్లలతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలకు విహారయాత్రకు వెళ్లారు. వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని సోమవారం ఉదయం కారులో పటాన్‌చెరు బయలుదేరారు. కడప, రేణిగుంట జాతీయ రహదారిలో కుక్కలదొడ్డి-మామండూరు మధ్యలో ప్రయివేటు బస్సు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్‌షా (45), అంజలీదేవి (40) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ముగ్గురు పిల్లలకు గాయాలయ్యాయి. వీరిలో పెద్ద కుమార్తెకు తీవ్రగాయాలు కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. పిల్లలకు తిరుపతిలో చికిత్స అందిస్తున్నారు. సందీప్ మృతితో పటాన్‌చెరు ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సందీప్‌షా మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దావోస్ పర్యటన తీర్థయాత్రగా మారింది

- సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సిద్దిపేట అర్బన్, జనవరి 20: దావోస్ పర్యటన సీఎంకు తీర్థయాత్రలకు, చీకటి ఒప్పందాలకు మాత్రమే పనికి వస్తున్నాయని.. దావోస్ పర్యటన వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన కార్మిక, కర్షక భవన్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బీవీ రాఘవులు మాట్లాడుతూ.. దేశంలో మోదీ తీసుకునే నిర్ణయాలు ప్రజలకు హాని చేసేలా ఉన్నాయన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదకరమన్నారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు డబ్బులు వెదజల్లే పరిస్థితి ఉత్పన్నమవుతుందని, దీనివల్ల రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయన్నారు. మోదీ రైతుల కోసం తీసుకొచ్చిన నల్లచట్టాలను రైతు ఉద్యమాలతో వెనక్కి తగ్గి ఇప్పుడు దొడ్డిదారిన ప్రవేశపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చట్టాలు తెచ్చేందుకు కేంద్రం చూస్తుందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాలను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో రాములు, మల్లారెడ్డి, గోపాలస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

పసుపుమయం..మల్లన్న క్షేత్రం

- భక్తిశ్రద్ధలతో కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో పెద్ద పట్నం
- ఉత్కంఠభరితంగా అగ్నిగుండాలు
- పట్నం దాటేందుకు ఇబ్బందులు పడిన అర్చకులు

పట్నం, అగ్నిగుండం

చేర్యాల, జనవరి 20: పట్నం వారం సందర్భంగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపుమయంగా మారింది. హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అగ్నిగుండాలను భక్తులు దాటే కార్యక్రమం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగగా, పెద్దపట్నం చూసిన భక్తులు భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు శనివారం ధూళిదర్శనం, ఆదివారం బోనాలు, పట్నాలు, సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ అర్చకులు పూజలు చేసిన అనంతరం హైదరాబాద్ ఒగ్గు పూజారులు పంచవర్ణాలు (తెలుపు, పసుపు, నీలి, ఎరుపు, ఆకుపచ్చ) రంగుల పిండితో పెద్దపట్నం వేశారు. అనంతరం పంచ పల్లవాలు(మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి) కట్టెలను వరుసగా పేర్చి అగ్నిగుండంగా తయారు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు ఆలయం నుంచి పెద్ద పట్నం, అగ్నిగుండం వరకు తీసుకొచ్చి పూజలు చేశారు. పెద్దపట్నం, అగ్నిగుండాలను ఆలయ అర్చకులు దాటిన వెంటనే భక్తులు పట్నం, అగ్నిగుండాలను దాటి మల్లికార్జున స్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు శివసత్తులకు, ఘనాచార్యులకు ఆలయ ఈవో రామాంజనేయులు, పాలక మండలి సభ్యులు కండువా, జాకెట్ ముక్కలతో పాటు స్వామి వారి బండారిని పంపిణీ చేశారు. అంతకుముందు భక్తులు పసుపును ఒల్లంతా పూసుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు.

భారీ బందోబస్తు

పట్నం, అగ్నిగుండం వారం సందర్భంగా మల్లన్న క్షేత్రంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీసీఎస్ ఏసీపీ యాదగిరి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. పోలీస్ అధికారులు సిబ్బందికి సూచనలు చేస్తూ సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, గజ్వేల్ అడిషనల్ సీఐ ముత్యం రాజు, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు. అగ్నిగుండం వద్ద సొమ్మసిల్లి పడిపోయిన ఓ భక్తురాలిని ఏఆర్ పీసీ మహేందర్ హుటాహుటిన మెడికల్ క్యాంపు వద్దకు ఎత్తుకెళ్లి వైద్యం అందించడంతో పలువురు అభినందించారు.

అందరి సహకారంతో విజయవంతం: ఈవో

కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో కీలకమైన మొదటి ఆదివారం(పట్నం వారం), అనంతరం నిర్వహించే పట్నం, అగ్నిగుండాలను అందరి సహకారంతో విజయవంతంగా పూర్తి చేశామని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. మల్లన్న ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో వారు సకాలంలో దర్శనాలు చేసుకున్నారని తెలిపారు. ఆయనతో పాటు ఆలయ పాలక మండలి సభ్యులు, ఏఈవో, సూపరింటెండెంట్లు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులున్నారు.

పట్నం దాటేందుకు ఇబ్బందులు పడిన అర్చకులు

పట్నం, అగ్నిగుండం దాటుతున్న భక్తులు

ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో పట్నం, అగ్నిగుండం వద్ద ప్రదక్షణ చేసిన అనంతరం కొబ్బరి కాయ కొట్టిన అనంతరం పట్నం తొక్కి, అగ్నిగుండం దాటి స్వామి వారి ఆలయానికి వెళ్లిపోతారు. అర్చకులు ఆలయంలో స్వామి వారి విగ్రహాలు తీసుకుని అగ్నిగుండం, పట్నం వేసిన ప్రదేశానికి చేరుకునే వరకు హైదరాబాద్ భక్తులతోపాటు ఇతరులు వారిని వెంబడించి వెళ్లడంతో అగ్నిగుండం నిర్వహించే ప్రధాన గేట్ వద్ద పోలీసులు అర్చకులను వదిలిపెట్టి ఇతరులను అక్కడి నుంచి పంపించేందుకు యత్నించినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. అర్చకులు పట్నం, అగ్నిగుండం ప్రదేశానికి చేరుకుని అక్కడ నిర్వహించే పూజా కార్యక్రమాలు ముగించక ముందే ఇతరులు పట్నం పైకి దూసుకుపోవడంతో అర్చకులు పట్నం దాటి అగ్నిగుండం తొక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు, ఆలయవర్గాల సహకారంతో అక్కడి నుంచి ఆలయానికి వెళ్లిపోయారు. ప్రతి ఏటా అర్చకులకు ఇదే పరిస్థితి తలెత్తుతుండడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌కు ఎస్‌వీఈఎస్ విద్యార్థులు

ఎంపికైన అభ్యర్థులు

నర్సాపూర్, జనవరి 20: విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎస్‌వీఈఎస్)కు చెందిన మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్లు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్‌టీ), జపాన్ స్పాన్సర్ చేసిన ప్రిస్టిజియస్ సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారని ఎస్‌వీఈఎస్ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుమమోటో యూనివర్సిటీ, జపాన్ ప్రొఫెసర్ డా.శూచిటోరీ మార్గదర్శకత్వంలో ఏడుగురు విద్యార్థులు, 1 ఫ్యాకల్టీ మెంబర్ ఆదివారం నుంచి 25వ తేదీ వరకు పునరుత్పాదక ఇంధన వనరులు, వేస్ట్-టు-ఎనర్జీ మార్పిడి సాంకేతికతపై పరిశోధనకు అనుభవాన్ని పొందనున్నారని వెల్లడించారు. ఎస్‌వీఈఎస్ ప్రఖ్యాత జపనీస్ యూనివర్సిటీలతో గ్లోబల్ అకడమిక్, రీసెర్చ్ సహకారాలను బలోపేతం చేస్తూ విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్లకు అభివృద్ధి చెందిన పరిశోధన, నైపుణ్య అవకాశాలను అందిస్తోందని తెలిపారు. ఎస్‌వీఈఎస్ చైర్మన్ విష్ణురాజు ఈ ప్రోగ్రామ్‌పై తన ఉత్సాహాన్ని పంచుకుంటూ ఈ ప్రోగ్రామ్ మా కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అంతర్జాతీయ పరిశోధన అవకాశాలను అన్వేషించడానికి, వారి సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చడానికి అగ్రశ్రేణి కోర్ కంపెనీల్లో విజయవంతమైన కెరీర్ కోసం సిద్ధమవ్వడానికి ఒక అద్భుతమైన వేదికను అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వీఈఎస్ సెక్రటరీ ఆదిత్య విస్సం, డీన్ రీసెర్చ్ డా.రాజు ఏడ్ల, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే ఎంపికైన అభ్యర్థులను అభినందించారు.

డ్రగ్స్ వ్యాపారం చేస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు

- రూ.21లక్షల విలువ చేసే ఎండీఎంఏ క్రిస్టల్స్ స్వాధీనం



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

సంగారెడ్డి జనవరి 20(నమస్తే తెలంగాణ): పుణె నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. అతడి నుంచి రూ.21 లక్షల విలువ చేసే 120మిల్లీగ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన హర్జత్‌సింగ్(35) హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. హర్జత్‌సింగ్ మొదట డ్రగ్స్‌ను అలవాటు చేసుకున్నాడు. వస్తున్న వేతనమంతా డ్రగ్స్‌కు ఖర్చు కావడంతో అదనపు అదాయం కోసం డ్రగ్స్‌ను అమ్మడం మొదలుపెట్టాడు. తొలుత సాఫ్ట్‌వేర్ కంపెనీలోని సహచరులకు, ఆ తర్వాత ఇతరులకు డ్రగ్స్ అమ్ముతూ వ్యాపారిగా మారాడు. మహారాష్ట్రలోని పుణె నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో సరఫరా చేసేవాడు. పుణె నుంచి హైదరాబాద్‌కు కారులో డ్రగ్స్ తీసుకుని బయలుదేరాడు. సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారులు సోమవారం పట్టణ సమీపంలోని మల్కాపూర్ ఫ్లైఓవర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. హర్జత్‌సింగ్ వాహనాన్ని తనిఖీ చేయడంతో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించారు. హర్జత్‌సింగ్ తన వాహనంలో తరలిస్తున్న ఎండీఎంఏ డ్రగ్ క్రిస్టల్స్‌ను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ రూ. 21.06 లక్షలు ఉంటుందని, నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ క్రిస్టల్స్‌ను రవాణా చేస్తున్న హర్జత్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా సమాజంలో మంచి గుర్తింపు, అదాయం ఉన్నప్పటికీ హర్జత్‌సింగ్ డ్రగ్స్‌కు అలవాటు పడి అదనపు ఆదాయం కోసం డ్రగ్స్ వ్యాపారిగా మారినట్లు అసిస్టెంట్ సూపరింటెండెంట్ చెప్పారు. హర్జత్‌సింగ్ డ్రగ్స్ వ్యాపారంపై మరింత విచారణ జరుపుతున్నట్లు వివరించారు. పట్టుకున్న బృందంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు యాదయ్య, హన్మంతు, శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నట్లు చెప్పారు.